

# చదువూ-సంస్కారం

—కొమ్మిడి మత్స్యేంద్రరెడ్డి

**ఇంటాయన** డాక్టరు. దాదాపు అరవై ఏళ్ళుండొచ్చు. భార్య కూడా బాగా చదువుకున్నదే. ఒక్కగా నొక్క కొడుక్కూడా డాక్టరై అమెరికా వెళ్ళాడట ఇంకా పై చదువుల కోసమని. అందుకే ఇల్లు అద్దె కిస్తున్నారట ఒంటరితనం భరించలేక. డబ్బు కిబ్బంది లేకపోయినా.

ఉన్నవి రెండు వాటాలు. కుడివేపున్న నాలుగు గదులలో ఏడాది నుండి ఉంటున్న భార్యాభర్త లిద్దరూ లెక్చరర్లు. నాలుగేళ్ళ బాబు, రెండేళ్ళ పాప. వారిని చూసుకునేందుకు పని మనిషి.

ఇక మిగిలిన వాటా ఎడమ వేపు ఉంది. నాలుగడుగుల గోడపై అమర్చిన ఐరన్ గ్రిల్‌తో చిన్న వరండా. అందులోంచి వెళ్తే ఒక గది... ఆ గదికి ఎడమవేపు చిన్న వంటిల్లు. బాత్ రూమ్. లావేటరీలు మరో వేపు ఉన్నాయి.

ఇంటావిడ చెప్తున్న వివరాలు వింటూ, ఇల్లు చూస్తున్న వసంత సంబర పడిపోయింది. ఆమే కాదు, రాజారావు కూడా మురిసిపోయాడు. హైదరాబాదులో కాపురం పెట్టిన నాలుగేళ్ళకు చక్కని ఇల్లు దొరికింది. అద్దె కూడా ఫరవాలేదు. మూడు వందల ఏభై... పైగా ట్వెంటీఫోరవర్సూ గలగల పారే పంపు. సెపరేట్ మీటరు. ఇంతకన్నా ఇంకేం కావాలి? ముఖ్యంగా సంస్కార వంతమైన చక్కటి ఇరుగూ పొరుగూ. మరీ అమాయకురాల యిన తన పల్లెటూరి భార్య ఈ పరిచయాలతో నయినా కాస్త సంస్కారం, లోకజ్ఞానం నేర్చుకుంటుంది. మూడేళ్ళ దీప్తికి కూడా ఆడుకుందికి పక్కింట్లో చిన్నపాప లున్నారు. ఇంతగా ఆలోచించి, మరేమి ఆలోచించకుండా నెల అద్దె, మూడు నెలల అడ్వాన్సు ఇచ్చి మరునటి రోజే చేరిపోయారు.

మరునాడు భర్త ఆఫీసుకు వెళ్ళాక వంటిల్లు సర్దుకుని, తీరిగ్గా ఏదో వార్తాపత్రిక చదువుకుంటున్న వసంత చటుక్కున తలెత్తింది. ఏదో అలికిడి వినిపించి. గ్రిల్ బయట నిలబడి ఉంది ఇంటావిడ రాజరాజేశ్వరీదేవి.


మందహాసం చేస్తూ ఆహ్వానించింది వసంత.


"కాసిని మంచి నీళ్ళివ్వు. వసంతా! ఈ సమ్మర్ తాళలేకపోతున్నాను. నోరెండుక పోతూంది. ఫైవ్ మినిట్స్ కొకసారి కోల్డ్‌వాటర్‌తో గొంతు తడుపుకోకపోతే ప్రాణం పోతుందనుకో." కూర్చుంటూనే చిన్నపాటి ఉపన్యాసం అందుకుంది.

"అవునండీ! ఈ ఏడు ఎండలు మరీ ఎక్కువగా ఉన్నాయి" అంటూ కూజాలోని నీటిని గ్లాసులోకి వంపుకుని తెచ్చింది వసంత.

గ్లాసును పెదాల కానించుకుందో లేదో తుపుక్కున ఉమ్మేసినంత పని చేసింది ఆవిడ.

అదిరిపోయింది వసంత. కొంపదీసి నీళ్ళలో ఏ ఈగో, దోమో రాలేదు కదా!






"అబ్బా! ఇవేం నీళ్ళు, వసంతా! ఆ ఎండకన్నా హాట్‌గా ఉన్నాయి. మైగాడ్... మీరెలా త్రాగుతున్నారో? ఫ్రిజ్ ఉందనుకున్నాను- పోన్లే. మా ఇంట్లోకి వెళ్ళాకే త్రాగుతాను. కాస్త ఫానన్నా వెయ్యి-" ముఖం చిట్లించుకుంటూ అని గ్లాసు కింద పెట్టేసింది.

ఆ మాటలతో బిక్కచచ్చిపోయింది వసంత. ఆ ఫ్రిజ్ ఏమిటో దూరం నుండి చూడడమే కాని, తెరిచి ఇప్పటిదాకా లోనికి తొంగి చూసిన పాపాన పోలేదు. ఇక ఒక ఫాన్ కొనాలని రెండేళ్ళుగా అనుకుంటున్నారే గాని, అదీ వీలు పడలేదు.

"సామానంతా పూర్తిగా షిఫ్ట్ చేయలేదా ఏమిటీ?" గదంతా కలయ చూస్తూ మళ్ళీ ఆమే అడిగింది.

ఉన్న ఒక్క నవారు మంచంవైపు అప్రయత్నంగా చూపులు పోతుంటే ఇబ్బందిగా కదులుతూ చెప్పింది వసంత- "అంతా తెచ్చుకున్నామండీ!" అంటూ.

సూర్యుడిపై నడుస్తున్న మనిషిని తమ కలర్ టి. వి.లో చూస్తున్నంత ఆశ్చర్యపోయింది రాజరాజేశ్వరి ఆ మాటలు వింటూనే... "వ్హాట్... మీకున్నది ఈ ఒక్క మంచమేనా? అదెలా?... కనీసం ఒక సోఫా సెట్, డైనింగ్ టేబిలూ... డ్రెస్సింగ్ టేబిలూ... పోనీ, కనీసం ఫానైనా లేకుండా ఎలా ఉంటున్నారు, వసంతా? ఓ!... మై పూర్ క్రీచర్స్... అబ్బాయికి అంత కెపాసిటీ లేకుంటే, మీ పేరంట్సయినా కొనివ్వొచ్చుగా! అవునూ, అడగడం మర్చేపోయాను. మీ డాడీ ఏం చేస్తుంటారూ? పెళ్ళయి కూడా ఎక్కువ కాలం కాలేదు. కట్నం ఏమివ్వలేదా? లేక ఇచ్చిన కట్నంతో మీ వారు తన సిస్టర్ మేరేజి కాని చేసేశాడా? ఈ రోజుల్లో మిడిల్ క్లాసు ఫామిలీస్‌లో అదో ఆచారం అయిందనుకో." అలా అలా అరగంట సేపు సాగిపోయింది ఆమె వాక్ప్రవాహం.

ఇంకా ఆమె ఏం అడిగిందో... ఏమేం చెప్పిందో గాని... పూర్తిగా బెదిరిపోయిన వసంత మాత్రం దిమ్మెరపోయి నోట మాట రాక శిలలా కూర్చుండిపోయింది.

సాయంత్రం భర్త వచ్చాక భోజనాలప్పుడు చెప్పాలనుకుంది.

"అటు పక్కా, ఇటు పక్కా రెండు వేపులా బాగా చదువుకున్న వాళ్ళున్నారు. వాళ్ళతో కలివిడిగా ఉండు. నీ వెప్పటిలాగే పల్లెటూరి మాటలు మాట్లాడుతూ, అవే పద్ధతులు కొనసాగిస్తే నవ్వుకుంటారు. ఈ రోజుల్లో కల్చర్ బాగా డెవలప్ అయిపోయింది. మరి, ఇన్నాళ్ళకు మన కో చక్కని ఇల్లూ, మంచి పొరుగూ దొరికినాయి. మనం ఎప్పుడైనా ఇల్లు ఖాళీ చేస్తామంటే వద్దని బ్రతిమాలేలా ఉండాలి. అంతేకాని, మన ప్రవర్తనతో వాళ్ళే వెళ్ళగొట్టే వరిస్థితి తెచ్చుకోకూడదు. ఈ నాలుగేళ్ళలో అనుభవమయిందిగా అద్దె కొంపల ప్రాబ్లమ్ ఎంతగా ఉందో!" కూతురును ఒళ్ళో కూర్చోబెట్టుకుని భోంచేస్తూ చెప్పుకుపోతున్న రాజారావు ముందు మరిక పెదవి విప్పలేకపోయింది వసంత.

*** ***

రెండు రోజుల తర్వాత భర్త ఆఫీసు నుండి రాగానే "దీప్తి ఏదీ?" అని అడిగినప్పుడు, "లెక్చరరు గారి పాపలతో ఆడుకుంటున్నట్టుంది. పిలుచుకు వస్తా నుండండి!" అంటూ ఆ వాటావైపు వెళ్ళింది వసంత.

తలుపు తట్టాలా, వద్దా అన్న సందిగ్ధంలో ఉండగానే మాటల్లు వినిపించినాయి. అదీ తన పాపతోనే కావడంతో వినకుండా ఉండలేకపోయింది.

"అయితే, నీ పేరు దీప్తన్న మాట. కాడ్‌బరీ ఎప్పుడూ తినలేదా, దీప్తీ!"

"తినలేదు." కూతురి మాటలు వినిపించాయి.

"మీ డాడీ ఎప్పుడూ తేలేదా?" మళ్ళీ అదే కంఠం. లెక్చరరు భారతి కాబోలు.

"చెప్పాలి... చెప్తేనే ఇస్తాను మరి! చూశావా, మా పాపలు ఎలా తింటున్నారో... మీ డాడీ ఎప్పుడయినా తెచ్చాడా, లేదా? చెప్తేనే ఇస్తాను."

"తేలేదు." పాప పలుకులు.

పకపకమని నవ్విన నాలుగు గొంతుకలు.

"చేసేది గుమస్తా పని... బిడ్డకు కొనిపెట్టడమటుంచి, లైఫ్‌లో వాడే ఎప్పుడైనా చూశాడో, లేదో!" బొంగురు కంఠం.

మళ్ళీ నవ్వులు... ఒక్క తన పాప తప్ప.

పక్కనే ఆనందంగా తింటున్న వారి పిల్లలు. మరో చిన్నారి పాపముందు కాడ్‌బరీ పెట్టి ఇవ్వకుండా ఊరిస్తూ, పగలబడి నవ్వుతూ, వినోదిస్తున్న రాక్షసుల్లాంటి ఆ దంపతులు... ఆ నవ్వులకు బెదరిపోయి గుటకలు మింగుతూ, తోటిపాపల వేపు ఆశగా చూస్తూ, తోడేళ్ళ మధ్య మేకపిల్లలా అసహాయంగా తన బిడ్డ... ఇక భరించలేకపోయింది వసంత. సుడులు తిరుగుతున్న దుఃఖం నాభి లోంచి తన్నుకొస్తుంటే, గబుక్కున తలుపు తెరుచుకుని, పాపనెత్తుకుని కనురెప్పపాటులో బయట పడింది. ఎవరేమనుకున్నా సరేననుకుంటూ. తమ వాటాలోకి వచ్చాక మాత్రం ఇంక ఆపుకోలేక భోరుమంది.

భార్యనా స్థితిలో చూసి బిత్తరపోయాడు రాజారావు.

అతి ప్రయాసతో ఇంటావిడతోనూ, పక్క వాటాలోనూ కలిగిన అనుభవాలను ఏకరువు పెట్టింది వెక్కిళ్ళ మధ్య.

ఆమె మానసిక వ్యథను అర్థం చేసుకున్నాక నిట్టూర్చాడు రాజారావు, ఇంకేం చేయాలో తోచక.

పక్షం రోజుల తరవాత కజిన్ పెళ్ళికని పుట్టింటికి వెళ్తున్న వసంత బస్సు ఎక్కాక చెప్పింది- త్వరలో ఇంకో ఇల్లు చూడండి!" అంటూ.

భార్య వెళ్ళి అప్పుడే నాలుగు రోజులయింది. ఆఫీను నుండి తిన్నగా సినిమాకెళ్ళి హోటల్లో భోంచేసి ఇంటికొచ్చిన రాజారావుకు విపరీతమైన దాహం వేసింది. కూజాను వంచాడు ఆత్రంగా. ఖాళీగా ఉంది. పంపు రావడం లేదు. నీళ్ళు లేకపోయేసరికి దాహం మరీ ఎక్కువయినట్టనిపించింది.

చెంబు తీసుకుని పక్క వాటావైపు నడిచాడు. తలుపు తట్టిన అయిదు నిమిషాలకు భారతి తలుపు తెరిచింది.

గుమ్మంలో నిల్చుని ఉన్న అతడిని చూస్తూనే క్షణకాలం తత్తరపడింది. కాని, అంతలోనే సర్దుకుంటూ "ఆయన లేరు. ఇన్విజిలేటరుగా వరంగల్లు వెళ్ళారు" అని గబగబా చెప్పింది.

"అహఁ! ఆయన గారి కోసం కాదు. కాసిని మంచినీళ్ళు కావాలని..." నసిగాడు చూపులు తిప్పుకుంటూ.

"ఉండండి!" అని వెళ్ళిన భారతి మరు నిముషంలో నిండుచెంబుతో తిరిగి వచ్చింది. "చూడండి! వేళా పాళా లేకుండా నీళ్ళు, పాలు అంటూ తలుపులు కొట్టడం మర్యాద కాదు. ఇకపై ఎప్పుడూ ఇలా చేయకండి" అంటూ 'ధన్' మనేలా పెట్టింది చెంబు.

చెంబు అందుకుని గాభరాగా పారిపోయి వచ్చేశాడు రాజారావు.

ఆ నీళ్ళు త్రాగడానికి అనువుగా లేవు. వెంటనే భార్యకు ఉత్తరం వ్రాసేశాడు-

"సంస్కారం సంపదలో, చదువులో, పదవిలో ఉండదనీ, అది ఉండేది పెరిగిన వాతావరణంలో, పెంచుకున్న వ్యక్తిత్వంలోననీ, ఎన్నో కారణాల వల్ల ఇప్పుడు తాము ఉంటున్న ఇల్లు ఒక మధ్య తరగతి కుటుంబానికి పనికి రాదనీ, అందుకే ఖాళీచేసి ఒక లాడ్జిలో రూము తీసుకుంటున్నాననీ, ఇల్లు దొరకగానే టెలిగ్రామ్ ఇస్తాననీ, అప్పటిదాకా నిష్కల్మషమైన ఆ పల్లెటూర్లోనే హాయిగా ఏ బెంగా లేకుండా ఉండమనీ."

*